

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

ఎట్టకేలకు ధరణి పెండింగ్ దరఖాస్తులకు మోక్షం

- కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్‌లకు బాధ్యత
- మండలస్థాయిలో మూడు బృందాల ఏర్పాటు
- ఒక్కో బృందం ఆరు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో విచారణ

సంగారెడ్డి రూరల్/మెదక్, మార్చి 1 : ఎట్టకేలకు పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులకు మోక్షం లభించనున్నది. భూసమస్యల పరిష్కారం కోసం అధికారులు కసరత్తును ప్రారంభించారు. ఈ మేరకు ధరణి పోర్టల్‌లో మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. సర్కారు ఆదేశాల మేరకు తొమ్మిది రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం

ధరణి పోర్టల్ అమలులోకి వచ్చిన తరువాత మ్యుటేషన్లు, పేరు మార్పిడి, పట్టా మార్పిడి, స్థల యజమాని మార్పు వంటి అనేక సమస్యలు తలెత్తాయి. ధరణి భూ సమస్యల పరిష్కారంపై కలెక్టర్‌కు మాత్రమే అధికారాలు ఉండేవి. ఎన్నో రోజులుగా బాధితులు భూసమస్యలను పరిష్కరించుకునేందుకు అధికారులు చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయారు. వ్యయప్రయాసాలనోర్చి కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైంది.

సంగారెడ్డి జిల్లాలో 18వేలు, మెదక్‌లో 1408 దరఖాస్తులు

సంగారెడ్డి జిల్లాలో 18వేలపైచిలుకు, మెదక్ జిల్లాలో 1408 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండు జిల్లాల్లోని సంగారెడ్డి, అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు, మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి ధరణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారిస్తున్నారు. గతంలో ఉన్న నిబంధనలను సవరించి ధరణిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే బాధ్యతను కలెక్టర్‌లు, ఆర్డీవోలు, తహసీల్దార్‌లకు ప్రాధాన్యతను బట్టి కేటాయించారు. క్షేత్రస్థాయిలో పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకు మండల స్థాయిలో మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందం ఐదు నుంచి ఆరు గ్రామాల్లో విచారిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఒక్కో మండలంలో 200 దరఖాస్తులు పెండింగులో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీటిని తొమ్మిది రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ ద్వారా పరిష్కరించనున్నారు.

త్వరగా పరిష్కరించాలి

- మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, మార్చి 1 : ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులపై కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో శుక్రవారం రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1408 పెండింగు దరఖాస్తులు ఉన్నాయన్నారు. మండలాల వారీగా శివ్వంపేటలో 168, పాపన్నపేటలో 75, కౌడిపల్లిలో 25, తూప్రాన్‌లో 113, నర్సాపూర్‌లో 87, టేక్మాల్‌లో 44, మెదక్‌లో 91, శంకరంపేటలో 157 దరఖాస్తులను పరిష్కరించాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. భూ ఆక్రమణల ఫిర్యాదులపై అధికారులతో సమీక్షించారు.



సంగారెడ్డిలోని రాజంపేటలో ధరణి దరఖాస్తు విచారణలో తహసీల్దార్ దేవీదాస్

ఆరోగ్య శాఖలో ఉద్యోగాలకు 2,500 దరఖాస్తులు

- ముగిసిన దరఖాస్తుల స్వీకరణ
- నోటిఫికేషన్‌లో పేర్కొనని పనిచేసే ప్రాంతం, వేతనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు



సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో ఆఫీస్ వద్ద దరఖాస్తు చేసుకుంటున్న నిరుద్యోగులు

సంగారెడ్డి అర్బన్, మార్చి 1 : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి జారీ చేసిన నోటిఫికేషన్‌పై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలు, ఆస్పత్రుల్లో పనిచేసేందుకు 97 పోస్టులకు గత నెల 27 న నోటిఫికేషన్ జారీ చేశారు. నోటిఫికేషన్‌కి సంబంధించిన గైడ్‌లైన్స్‌తో పాటు దరఖాస్తు ఫారాన్ని కలెక్టర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. అయితే దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగిసింది. సుమారు 2,500 వరకు దరఖాస్తులు వచ్చాయని ఆరోగ్య శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పనిచేసే ప్రాంతం, వేతనం పేర్కొనలేదు. అంతే కాకుండా దరఖాస్తుల స్వీకరణకు మూడు రోజులే గడువు ఇవ్వడం పట్ల అభ్యర్థులు మండిపడుతున్నారు. డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా జరిగే ఈ నియామకాల విషయంలో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అర్హులైన వారికి ఉద్యోగాలు దక్కేలా చూడాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

మెదక్ జిల్లాలో 4,500 మందికి జీరోబిల్లులు

- ప్రారంభమైన గృహజ్యోతి

8లో



తూప్రాన్‌లో జీరో బిల్లు అందజేస్తున్న డీఈ

220 కిలోల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్టు, ఇద్దరు పరారీ



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, కారు

పటాన్‌చెరు, మార్చి 1: ఆంధ్ర, ఒడిషా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తున్న 220 కిలోల గంజాయిని పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ఔటర్ రింగ్ రోడ్డు ముత్తంగి జంక్షన్ వద్ద పట్టుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ వివరాలను తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పటాన్‌చెరు ఎక్సైజ్ సిబ్బంది, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ఔటర్ రింగ్ రోడ్డు ముత్తంగి జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. రింగ్ రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి వస్తున్న కారుని తనిఖీ చేయగా, 220 కిలోల ఎండుగంజాయి ప్యాకెట్లు లభించాయి. గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులలో ఇద్దరు పారిపోగా, ఒకరిని అరెస్ట్ చేశారు. ఆంధ్ర, ఒడిషా సరిహద్దు నుంచి మహారాష్ట్ర సతారా జిల్లాకు గంజాయిని తరలిస్తున్నట్లు నిందితుడు అంగీకరించాడు. గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులు మహారాష్ట్ర సతారాకు చెందిన వారే. నిందితుడు చంద్రకాంత్‌కారేను అరెస్ట్ చేయగా విశాల్‌దిలీప్, అమర్‌సంజయ్ పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.55 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై.. తండ్రిని చంపిన కుమారుడు



చంద్రయ్య(ఫైల్)

మనోహరాబాద్, మార్చి1 : మద్యానికి బానిసైన కుమారుడు తండ్రిని కొట్టి చంపిన ఘటన మనోహరాబాద్ మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన బొంతపల్లి చంద్రయ్య(48) కుమారుడు ప్రశాంత్ తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతుండడంతో ఎన్నిసార్లు చెప్పినా వినలేదు. రోజు తాగివచ్చి తండ్రితో గొడవపడేవాడు. గురువారం రోజున మధ్యాహ్న సమయంలో ఇద్దరికీ గొడవ జరిగింది. మాటమాటా పెరగడంతో కుమారుడు ప్రశాంత్ గొడ్డలితో తండ్రి తలపై గట్టిగా కొట్టాడు. తీవ్రగాయాలైన చంద్రయ్యని కుటుంబసభ్యులు చుట్టపక్కల వారి సహాయంతో తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్రయ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. కానీ, కుటుంబ సభ్యులు చంద్రయ్యను ఇంటి వద్దకు తీసుకెళ్లగా గురువారం రాత్రి 11గంటల సమయంలో మృతిచెందాడు. ఈ విషయంపై చంద్రయ్య భార్య బొంతపల్లి నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

బీజేపీ నుంచి కాంగ్రెస్ వైపు వలసలు!

గజ్వేల్, మార్చి 1 : భారతీయ జనతా పార్టీ నాయకులు ఆ పార్టీకి ఝలక్ ఇవ్వనున్నారు.! ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్‌పై అసంతృప్తితో ఉన్న సీనియర్ నాయకులు మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం ఆయనను గెలిపించేందుకు శాయశక్తులా శ్రమించారు. అయినప్పటికీ ఫలితం దక్కలేదు. అయితే, ఈటల రాజేందర్ మల్కాజ్‌గిరి పార్లమెంట్‌పై దృష్టిసారించడంతో ఆయనను నమ్ముకుని పార్టీలో చేరిన నాయకులను పట్టించుకోవడం లేదని తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత అధికార పార్టీ నాయకులకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తున్నది.



సంగారెడ్డిలోని ఐబీ వద్ద డ్యాన్స్ చేస్తున్న మెడికల్ కాలేజీ విద్యార్థులు



ఫ్లాష్‌మాబ్‌ను తిలకిస్తున్న కలెక్టర్ క్రాంతి, తదితరులు



డ్రగ్స్ భూతాన్ని తరిమేద్దాం

- సంగారెడ్డి మెడికల్ కాలేజీ విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

సంగారెడ్డి అర్బన్, మార్చి 1 : మాదక ద్రవ్యాల వినియోగం, దాని వాడకంతో కలిగే అనర్థాలపై సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులు శుక్రవారం ఫ్లాష్ మాబ్‌ను నిర్వహించారు. సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వద్ద ప్రధాన రహదారిపై ఫ్లాష్‌మాబ్‌తో ప్రజలకు అవగాహన కల్పించారు. సుమారు గంటపాటు వివిధ రకాల పాటలపై డ్యాన్సులు చేస్తూ మాదక ద్రవ్యాల వాడకం, దాని వలన కలిగే నష్టాలను వివరించారు. మెడికల్ కాలేజీ విద్యార్థులు చేసిన ఫ్లాష్ మాబ్‌ను కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ డ్రగ్స్ భూతాన్ని పూర్తిగా తరిమేయాలంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి డైరెక్టర్ వాణి, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుధామాధురి, జీజీహెచ్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, ఆర్ఎంవోలు వీరాంజనేయులు, రవికుమార్, డాక్టర్లు, మెడికోలు పాల్గొన్నారు.

సీఎంఆర్ ఇవ్వని 12 మిల్లులకు నోటీసులు

- క్రిమినల్ కేసులు నమోదుకు అధికారుల యోచన
- మరో రెండు రోజుల్లోగా అప్పగించాలి
- సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ

మెదక్, మార్చి 1 : గడువు ముగిసినా కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఇవ్వని 12 మిల్లులకు పౌరసరఫరాల శాఖ అధికారులు నోటీసులను అందజేశారు. వానాకాలం 2022-23 సీజన్‌కు సంబంధించి 3,68,278 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 158 రైస్‌మిల్లులకు కేటాయించగా 2,47,557 మెట్రిక్‌టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం రైస్ మిల్లర్లకు సీఎంఆర్ బియ్యం అప్పగించడానికి పలుమార్లు గడువు పొడిగిస్తూ వచ్చింది. ఫిబ్రవరి 29 వరకు తుది గడువుగా ఖరారు చేసింది. అప్పటికీ 2,36,950 మెట్రిక్ టన్నులను సేకరించారు. దీంతో జిల్లాలో 96 శాతం సీఎంఆర్ పూర్తయింది. ఇంకా 10,607 మెట్రిక్ టన్నుల బియ్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. బియ్యం మాయం చేసిన మిల్లర్లను నిషేధిత జాబితాలో చేర్చి క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే 12 మంది మిల్లుల యజమానులకు నోటీసులను అందజేశారు. వారి ఆస్తులను జప్తు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిసింది. మరో రెండు రోజుల్లోగా సీఎంఆర్ బియ్యం అప్పజెప్పాలని, లేదంటే మిల్లర్లపై చర్యలు తప్పవని సివిల్ సప్లయ్ డీఎం హరికృష్ణ హెచ్చరించారు. చివరిసారిగా ఈ వెసులుబాటు కల్పిస్తున్నామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అయితే సీఎంఆర్ ఇవ్వని పలువురు మిల్లర్లు అజ్ఞాతం బాటపట్టినట్లు స్థానికంగా పుకార్లు వ్యాపిస్తున్నాయి.

ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తాం

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, మార్చి 1 : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణ, ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాట్లపై శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సంగారెడ్డి కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి, మెదక్ కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు వివరాలను సీఎస్‌కు వివరించారు.



హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎస్



మెదక్ కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు



సీఎం రేవంత్‌ను జాతరకు ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, తదితరులు

ఏడుపాయల జాతరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

- సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి

మెదక్, మార్చి 1. రాష్ట్రంలో ప్రఖ్యాతిగాంచిన ఏడుపాయల వనదుర్గాభవానీ జాతరకు విచ్చేయాల్సిందిగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. శుక్రవారం సీఎం నివాసంలో ఆయనను కలిశారు. సీఎం సానుకూలంగా స్పందిస్తూ మార్చి 8న ఏడుపాయల జాతరకు విచ్చేసి వనదుర్గమాత దర్శనం చేసుకుంటానని తెలిపారు. సీఎంను కలిసిన వారిలో నాయకుడు కావేరిగారి వెంకట్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

విధులకు డుమ్మా కొట్టి.. కలెక్టర్ కాన్వాయ్‌ని ఢీకొట్టిన హెచ్‌ఎం

- సస్పెండ్ చేసిన డీఈవో

మనూరు, మార్చి 1: విధులకు డుమ్మా కొట్టి సంగారెడ్డిలో కలెక్టర్ కాన్వాయ్‌ని ఢీ కొట్టినందుకు మనూరు మండలం పుల్‌కుర్తి పాఠశాల హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారని మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం పుల్‌కుర్తి పాఠశాలను ఎంఈవో శ్రీనివాస్ సందర్శించి వివరాలను వెల్లడించారు. ప్రధానోపాధ్యాయుడు గోవింద్‌నాయక్ విధులకు హాజరు కాకుండా సంగారెడ్డికి కారులో ప్రైవేటు పనుల కోసం వెళ్లి కలెక్టర్ కాన్వాయ్‌ని ఢీ కొట్టాడన్నారు. దీంతో విచారణ జరుపగా కలెక్టర్ కాన్వాయ్‌ని ఢీ కొట్టిన వ్యక్తి పుల్‌కుర్తిపాఠశాల హెచ్‌ఎం అని తెలియడంతో, జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు తాము పాఠశాలను తనిఖీ చేశామన్నారు. ఎలాంటి సెలవు పత్రం ఇవ్వకుండా ఎంఈవోకు సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొట్టినట్లు తేలడంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట బోరంచ క్లస్టర్ అధికారి అంజిరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, మార్చి 1: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో అసిస్టెంట్ ఎలక్ట్రీషన్ కోర్సులో 90 రోజుల ఉచిత శిక్షణకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఖేడ్ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి నగేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జిల్లాలోని మున్సిపల్ ప్రాంతాలకు చెందినవారై, 10 తరగతితో పాటు ఆపై తరగతుల ఉత్తీర్ణత సాధించిన 18నుంచి 33ఏళ్ల వయస్సు లోపు ఉన్న నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, షూ, హెల్మెట్, స్టేషనరీ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందించడంతోపాటు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఆసక్తి గలవారు. అవసరమైన ధ్రువ పత్రాల జిరాక్స్ ప్రతులతో దరఖాస్తులను ఈ నెల 4న సాయంత్రం వరకు సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మిగతా వివరాలకు 7780791531కు సంప్రదించాలన్నారు.

ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి


ఆగ్రో సేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ విజయనిర్మల

చిన్నశంకరంపేట, మార్చి 1: రైతులు కొనుగోలు చేసిన ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరచాలని ఏడీఏ విజయనిర్మల ఫర్టిలైజర్, సీడ్ షాపు డీలర్లకు సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట, జంగరాయి, చందంపేట సొసైటీలను ఆమె సందర్శించారు. సొసైటీ సీఈవోలతో ఎరువు బస్తాల నిలువపై సమీక్షించారు. అనంతరం చిన్నశంకరంపేట ఆగ్రోస్ సేవా కేంద్రం, గవ్వపల్లి ఎక్స్ రోడ్డు రామలింగేశ్వర ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో నిలువ ఉన్న యూరియా బస్తాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు పిచికారి మందులు కొనుగోలు చేసినప్పుడు రసీదుతో పాటు రైతు వివరాలను ఆన్‌లైన్లో పొందుపరుచాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియాను స్టాక్ ఉంచకుండా తగిన మోతాదులోనే యూరియా బస్తాలను షాపులలో స్టాక్ ఉంచాలని డీలర్లకు సూచించారు. ప్రతీ షాపులో గుర్తింపు పొందిన పిచికారి మందులను విక్రయించాలన్నారు. రైతులు తప్పనిసరి వ్యవసాయాధికారుల సలహాలు పాటించి మందులను స్ప్రే చేయాలని సూచించారు. ఆమె వెంట ఏవో లక్ష్మీప్రవీణ్, ఏఈవోలు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించడం హర్షణీయం


చిన్నశంకరంపేటలో హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్టీయూ నాయకులు

చిన్నశంకరంపేట, మార్చి 1: ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న డీఎస్సీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... వచ్చే జూన్ నుంచి నూతన ఉపాధ్యాయులు వచ్చే వరకు పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. జీవో ఎంఎస్ నెంబర్ 31 కమిటీ వేయడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కన్వీనర్ శివరాజయ్య, వెల్దుర్తి మండల ప్రధాన కార్యదర్శి కిరణ్, రామాయంపేట మండలాధ్యక్షుడు శ్రీనివాస్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 1: మండలంలోని వాడి పాఠశాలను ఎంపీడీవో హరిశ్వర్ గౌడ్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులు, హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించాలన్నారు. తరగతిలోని విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాలను తెలుసుకొన్నారు. ఉపాధ్యాయుల పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీవో రాజ్ కుమార్, ఉపాధ్యాయులు సుభాష్ రెడ్డి, తదితరులున్నారు.

స్వీప్ ద్వారా అవగాహన

● సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి



కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సంగారెడ్డి రూరల్, మార్చి 1: స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటింగ్ పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చిరునామా మారిన ఓటర్ల వివరాలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు, మరణించిన ఓటర్ల జాబితాను తన దృష్టికి తీసుకురావాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ప్రత్యేకంగా పరిశీలించి విచారణ జరిపిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సదుపాయాలు, వృద్ధులు, దివ్యాంగులకు ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పెళ్లిళ్ల సీజన్‌లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నందున వివాహ కార్యక్రమాలకు షాపింగ్‌కు ప్రజలు తమ వెంట నగదు తీసుకువెళ్తారని, అందువల్ల చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో పట్టుబడిన నగదును వారికి వెంటనే అందించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అందుకు ఆమె స్పందిస్తూ ఎన్నికల కోడ్ తరువాత చెక్‌పోస్టుల్లో పట్టుబడిన నగదుకు సరైన పత్రాలు చూపించి నగదును పొందవచ్చని వివరించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా సబ్‌స్టేషన్ మరమ్మతులు

● మరో నాలుగు రోజుల్లో వినియోగంలోకి.. ప్రస్తుతం రెండు పీటీఆర్‌లతోనే అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

సిద్దిపేటరూరల్, మార్చి 1: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో 100ఎంవీఏ పీటీఆర్ బిగింపు పనులు చకచకా కొనసాగుతున్నాయి. ట్రాన్స్‌కో ఉద్యోగులు, కార్మికులు మొత్తం 50మంది రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. వికారాబాద్ జిల్లా కేతిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్‌లో అదనంగా ఉన్న పీటీఆర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్)ను తీసుకొచ్చి సిద్దిపేటలో బిగిస్తున్నారు. ఫిబ్రవరి 21న రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో బేస్‌మెంట్‌తో సహా ధ్వంసమైన పరికరాలన్నింటినీ తొలగించి నూతన పరికరాలను ఏర్పాటు చేస్తున్నారు. 6ఫీట్ల బేస్‌మెంట్ నూతనంగా నిర్మించారు. పీటీఆర్‌ను మాత్రమే కేతిరెడ్డిపల్లి నుంచి తెచ్చారు.



సిద్దిపేట సబ్‌స్టేషన్‌లో పీటీఆర్ నిర్మాణ పనుల్లో నిమగ్నమైన ఉద్యోగులు, కార్మికులు

సిబ్బంది అప్రమత్తంతో అంతరాయానికి చెక్

సిద్దిపేట సబ్ స్టేషన్‌లోని మూడు పీటీఆర్‌లతో సిద్దిపేట, దుబ్బాక, సిద్దిపేట రూరల్ సబ్ డివిజన్‌లకు విద్యుత్ సరఫరా కొనసాగుతుంది. అందులో ఒకటి ప్రమాదానికి గురైనప్పటికీ మిగతా రెండింటితో ఈ ప్రాంతాలలోని రైతులకు, పరిశ్రమలకు, విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. రెండు పీటీఆర్‌లతో విద్యుత్ సరఫరా చేయడం కారణంగా ఓవర్‌లోడ్ అయినప్పటికీ ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ చిన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. పీటీఆర్ ప్రమాదం వల్ల రోజుల తరబడి విద్యుత్ అంతరాయం కలుగుతుందన్న వినియోగదారుల భయాన్ని తొలగిస్తూ నిరంతర అందిస్తామనే భరోసాను విద్యుత్‌శాఖ కల్పిస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. రెండు రోజుల్లో బిగింపు పనులు పూర్తవుతాయని, మరో రెండు రోజుల్లో ట్రయల్ రన్ చేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్‌ను ఫిల్టర్ చేయాల్సి ఉంటుంది. దాంతో మార్చి 6వ తేదీ నుంచి వినియోగంలోకి తేనున్నట్లు సమాచారం.

వెంటాడుతున్న కోతల భయం

వేసవికాలం కావడంతో విద్యుత్ ఉత్పత్తి తగ్గి విద్యుత్ కోతలు ఉంటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు సిద్దిపేట సబ్ స్టేషన్‌లో పీటీఆర్ ప్రమాదానికి గురవడం మరింత ఆందోళన కలిగిస్తున్నదని రైతులంటున్నారు. పంటలకు ఈ సమయంలోనే నీటి శాతం అధికంగా అవసరముంటుందని, విద్యుత్ కోతల సమస్య తలెత్తితే భారీగా పంట నష్టం జరిగే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా పీటీఆర్‌ను బిగించి వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ఆందోళన అవసరం లేదు



మూడు పీటీఆర్‌ల ద్వారా విద్యుత్ సరఫరా అందించాల్సి ఉంటుంది. అందులో ఒకటి అంతర్గత సమస్యతో పేలిపోయింది. రెండు పీటీఆర్‌లతో సరఫరాలో అంతరాయం కలుగుతుందని రైతులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. మరో నాలుగు రోజుల్లో పీటీఆర్ బిగింపు పనులు కూడా పూర్తవుతాయి. వేసవికాలం కాబట్టి విద్యుత్ అంతరాయం ఉంటుందనే రైతుల అపోహలకు అవకాశం లేదు. పరిశ్రమలకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రస్తుతం బిగిస్తున్న 100ఎంవీఏ పీటీఆర్‌తో మరింత మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తాం.

- శ్రీనివాసులు, ట్రాన్స్‌కో డీఈ , సిద్దిపేట

డాక్టర్లు సమయపాలన పాటించాలి

● జీజీహెచ్‌ను సందర్శించిన డీఎంఈ వాణి



డీఎంఈ డాక్టర్ వాణికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అనీల్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధామాధురి

సంగారెడ్డి అర్బన్, మార్చి 1: సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని మెడికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి డైరెక్టర్(డీఎంఈ) డా.ఎన్.వాణి సందర్శించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డా.వాణిని ఇటీవల ప్రభుత్వం డీఎంఈగా నియమించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఆమె డీఎంఈ హోదాలో సంగారెడ్డి జీజీహెచ్‌ను సందర్శించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో ఆమె డాక్టర్లు విధులకు హాజరవుతున్న సమయాన్ని పరిశీలించారు. 10.30 గంటల వరకూ డాక్టర్లు విధులకు హాజరుకాకపోవడం పట్ల ఆమె పలువురు డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకుంటే ఎలా.. ఓపీ ద్వారా వచ్చే రోగులకు ఏ విధంగా వైద్య సేవలందిస్తారంటూ ప్రశ్నించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, సమయపాలన పాటిస్తూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని ఆమె సూచించారు. కాగా డీఎంఈ హోదాలో డా.వాణి తొలిసారి జీజీహెచ్‌కు రావడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్, మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, ఆర్‌ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్ తదితరులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గల్లీలో లేదు.. ఢిల్లీలో లేదు బీఆర్ఎస్ ఒక్క సీటూ గెలిచేది లేదు

● విజయ సంకల్పయాత్రలో బీజేపీ నేత, మాజీ ఎంపీ బూరనర్సయ్య గౌడ్



కొమురవెల్లిలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

చేర్యాల, మార్చి 1: పదేళ్లపాలనలో తెలంగాణ విధ్వంసానికి పాల్పడిన బీఆర్ఎస్ ప్రస్తుతం గల్లీలో, ఢిల్లీలో ఎక్కడా లేదని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అసలు గెలిచేదీ లేదని బీజేపీ నేత, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. బీజేపీ విజయ సంకల్పయాత్రలో భాగంగా కొమురవెల్లి మండలకేంద్రం నుంచి జనగామ జిల్లాకేంద్రం వరకు చేపట్టిన బైక్ ర్యాలీని శుక్రవారం కొమురవెల్లిలో ప్రారంభించిన అనంతరం చేర్యాలలోని అంగడిబజారులో రోడ్ షోలో ప్రసంగించారు. బీఆర్ఎస్‌ను నమ్ముకుంటే రూ.7 లక్షలకోట్లు అప్పుల పాలయ్యామన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు దేశప్రజలు సురక్షితంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సాధ్యం కాని హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌తో ప్రజలకు ఒరిగేదేమీలేదన్నారు. కాంగ్రెస్‌తో కరెంటు కష్టాలు నెలకొని పొలాలు, బోర్లు ఎండిపోతున్నాయన్నారు. వరి పొలాలను పశువులు మేస్తున్నాయని, రైతుబంధు రాలేదని ఎద్దేవా చేశారు. కేంద్రీయ విద్యాలయాలు, పాస్‌పోర్టు కేంద్రం, ఎయిమ్స్, జాతీయ రహదారులు వంటి వసతుల కల్పనతో భువనగిరి పార్లమెంట్ నియోజకర్గ పరిధిలో రూ.లక్ష కోట్ల సంపద పెంపొందిందన్నారు. తెలంగాణలో పండిన ప్రతీ గింజను కేంద్రం కొనుగోలు చేసి, రూ.9.36లక్షల కోట్లు నిధులు ఇచ్చిందన్నారు. బీజేపీతోనే కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ సాకారమైందన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నియోజకవర్గానికి సాగునీరు ఇవ్వని బీఆర్ఎస్ చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయకుండా వివక్ష వహించిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి పట్టంకట్టాలని కోరారు. అంతకుముందు కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షులు ఆరుట్ల దశమంతరెడ్డి, సిద్దిపేట అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమా రాణి, నాయకులు కూరెల్ల రాజు, కేవీఎల్ఎన్‌రెడ్డి, బూరుగు సురేశ్, ఉమారాణి, దండ్యాల లక్ష్మారెడ్డి, మన్నె సత్యవర్ధన్, కుర్రారం బాలనర్సయ్య, వడ్లకొండ సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ కొత్త నాటకం

● గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



గజ్వేల్, మార్చి 1: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు కొత్త నాటకానికి తెరలేపారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు ఛలో మేడిగడ్డ యాత్ర చేపట్టడం సిగ్గుచేటన్నారు. నాసిరకంగా నిర్మించి ప్రాజెక్టు వైఫల్యానికి కారణమైన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల కోసం కొత్త నాటకానికి తెరలేపడం విడ్డూరమన్నారు. బీఆర్ఎస్ నాయకులు తప్పు ఒప్పుకుని వెంటనే ప్రజలకు, రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం సరిగా లేదని తేల్చారని, అయినప్పటికీ సిగ్గు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటూ రాదన్నారు. మెదక్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.

ఆరోగ్య సమాజానికి పునాది వేద్దాం

● అసిస్టెంట్ డైరెక్టర్, వరంగల్ జోనల్ మలేరియా అధికారి నాగయ్య



సింగాటం గ్రామంలో ఫైలేరియా ఇంటింటి సర్వేను పర్యవేక్షిస్తున్న వరంగల్ జోనల్ మలేరియా అధికారి నాగయ్య

గజ్వేల్, మార్చి 1: దోమలను అరికట్టి ఆరోగ్య సమాజానికి పునాది వేద్దామని అసిస్టెంట్ డైరెక్టర్, జోనల్ మలేరియా అధికారి ఈ.నాగయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్ మండలం సింగాటం గ్రామంలో గురువారం రాత్రి ఇంటింటికీ తిరిగి ప్రీటాస్ మైక్రో ఫైలేరియా సీజనల్ సర్వేలో భాగంగా ఫైలేరియా బ్లడ్ శాంపిళ్లను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫైలేరియా రోగకారక క్రిములు వ్యాప్తి చెందుతున్నాయా అని సర్వే నిర్వహించామన్నారు. మురికి కాల్వలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణకై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. దోమల వల్ల అనేక రకాల వ్యాధులు సంక్రమిస్తాయని, ఫైలేరియా, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గునియా లాంటి వ్యాధులు సంక్రమిస్తాయని, మన ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్టే పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆరుగురు పారామెడికల్ సిబ్బందితో సుమారు 300మందికి బ్లడ్ స్పియర్స్ తీసి ప్రీ టాస్ మైక్రో ఫైలేరియా సర్వే నిర్వహించామని తెలిపారు. వారితో ఎంపీహెచ్‌ఈవో ఎ.రమేష్, ఫైలేరియా సూపర్‌వైజర్ చిన్న కొండయ్య, గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, డి.నాగరాజు, ల్యాబ్ టెక్నీషియన్లు కోటేశ్వరరావు, బాలరాజేశం, ఫరీద్‌ఖాన్, అహ్మదీపూర్ సూపర్‌వైజర్ శోభారాణి, ఆశా వర్కర్లు వజ్రమ్మ, నాగమణి, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

● ప్రారంభమైన ప్రీ-ఫైనల్ పరీక్షలు



కూచన్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో ప్రీ-ఫైనల్ పరీక్షలు రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

మెదక్ అర్బన్, మార్చి 1: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. మెదక్ జిల్లాలో ఇప్పటికే సిలబస్ రివిజన్‌తోపాటు ప్రత్యేక క్లాస్‌లు పూర్తి చేశారు. వార్షిక పరీక్షలపై విద్యార్థులు పట్టు సాధించేందుకు వీలుగా ప్రీ-ఫైనల్-1 పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నుంచి మధ్యాహ్నం వేళల్లో జిల్లా వ్యాప్తంగా ప్రీ-ఫైనల్ పరీక్షలు ప్రారంభించారు. తొలి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 2న హిందీ, 4న ఇంగ్లీష్, 5న గణితం, 6న భౌతిక శాస్త్రం, 7న జీవశాస్త్రం, 11న సామాజిక శాస్త్ర పరీక్షలు జరుగనున్నాయి. ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న వార్షిక పరీక్షలకు విద్యార్థులను అన్ని విధాలా సన్నద్ధం చేస్తున్నట్లు విద్యాధికారులు తెలిపారు. వార్షిక పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 68 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 10,300 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 1: మండల పరిధిలోని శమ్నాపూర్ శివారులోని రాజరాజేశ్వరి ఆలయంలో శుక్రవారం మెదక్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడికి, రామాయంపేట మండలానికి చెందిన బాలికకు పెళ్లి చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికను మెదక్ సఖి కేంద్రానికి తరలించారు. బాలుడినికుటుంబ సభ్యులతో పంపించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రాజు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలను ఎవరైనా ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న వయస్సులో వివాహాలు జరిగితే ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఆయనవెంట పోలీసులు బేతయ్య, నర్సింహులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఝరాసంగం, మార్చి 1: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు రమ్య, ఉపాధ్యాయుడు రాంచందర్ భీంవంశీ పేర్కొన్నారు. శుక్రవారం ఝరాసంగంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థులు స్థానిక ప్రభుత్వాస్పత్రి ప్రాంతంలో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు రమ్య, ఉపాధ్యాయుడు రాంచందర్‌భీంవంశీ మాట్లాడుతూ.. ఇళ్లల్లో తడి, పొడి చెత్త బుట్టలను వేర్వేరుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెత్తను వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకుని అందులో వేయాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీవైద్యాధికారి సుదర్శన్ పాల్గొన్నారు.



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉగాండాలో నార్సింగ్ వాసి ఆత్మహత్య

● స్వస్థలానికి మృతదేహం తరలింపు

చేగుంట, మార్చి 1: సౌత్ ఆఫ్రికా ఉగాండా దేశంలో మెదక్ జిల్లా నార్సింగ్ మండల కేంద్రానికి చెందిన ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నార్సింగి మండల కేంద్రానికి చెందిన తమ్మారెడ్డి గారి లక్ష్మారెడ్డి కుమారుడు తమ్మారెడ్డి కరుణాకర్ రెడ్డి(40) రెండేళ్ల క్రితం ఉపాధి కోసం సౌత్ ఆఫ్రికాలోని ఉగాండాకు చెందిన సూడాన్ ఎక్స్‌పోర్ట్ కంపెనీలో పని చేయడానికి వెళ్లాడు. ఫిబ్రవరి 26న కరుణాకర్‌రెడ్డి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడి కరుణాకర్ మిత్రులు నార్సింగ్‌లోని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వస్థలం రప్పించడానికి తెలంగాణ వలస కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. సాయేందర్‌ను సంప్రదించగా, ఉగాండా నుంచి మృతదేహాన్ని తెప్పించడంతో పాటు శంషాబాద్ విమానాశ్రయం నుంచి స్వగ్రామం వరకు ప్రభుత్వం తరపున ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం వలస వెళ్లి చనిపోయిన వారి అంత్యక్రియలకు, కుటుంబ సభ్యులకు ఆర్థికంగా ఆదుకోవాలని సాయేందర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మృతుడికి భార్య లావణ్య కొడుకు భానుప్రసాద్ రెడ్డి(10), కూతురు భానుప్రియ (12) ఉన్నారు.

చిప్పల్‌తుర్తి శివారులో వ్యక్తి హత్య



దుర్గేష్(ఫైల్)

నర్సాపూర్, మార్చి 1: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి శివారులో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చిప్పల్‌తుర్తి సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో ఓ మృతదేహం పడిఉందని స్థానికుల సమాచారం మేరకు సీఐతో పాటు పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించగా మృతదేహంపై బలమైన గాయాలున్నాయి. ఎవరో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లికి చెందిన దుర్గేష్(28) అని తేలింది. ఈ మేరకు కుటుంబీకులకు సమాచారమిచ్చి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు సీఐ తెలిపారు. మృతదేహాన్ని నర్సాపూర్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

హత్యకేసులో పోలీసుల అదుపులో ముగ్గురు..

జిన్నారం, మార్చి 1: వ్యక్తి హత్య కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు బొల్లారం సీఐ నయిమొద్దీన్ తెలిపారు. గత నెల 27న మాదారం, కొడకంచి శివారులో హత్యకు గురైన నల్తూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్(27) హత్య కేసులో నిందితులైన ముగ్గురిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. కాగా శ్రీకాంత్‌కు వాడక్‌పల్లి గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసింది. కేసులో నిందితులైన గౌతమ్, విక్రమ్, రాములును అదుపులోకి తీసుకున్నారు.

బొలెరో వాహనం బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం



పీర్ భాష మృతదేహం

రామాయంపేట, మార్చి 1: బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదం రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట శివారులో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి ప్రాంతానికి చెందిన పీర్ భాష (60) ఈ ఉదయం గోధుమ పొట్టు లోడుతో పటాన్ చెరువు నుంచి కామారెడ్డికి బయలుదేరాడు. ఈ క్రమంలో నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతో ఒక్కసారిగా బొలెరో వాహనం పల్టీ కొట్టి రోడ్డు కిందకు దూసుకుపోయింది. దీంతో పీర్ భాష అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ సమాచారమందుకున్న ఎస్ఐ ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. కేసు దర్యాప్తు జరుపుతున్న ఎస్ఐ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

చేగుంట, మార్చి 1: చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సింగ్ మండల పరిధిలోని శేరిపల్లిలో శుక్రవారం చోటు చేసుకున్నది. శేరిపల్లి గ్రామానికి చెందిన బండారు మల్లేష్ యాదవ్ (40) చింత పండు కొట్టడానికి కూలీకి వెళ్లాడు. చెట్టు పైకి ఎక్కి చింత కాయలు కొడుతూ ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు వెంటనే అతడిని నార్సింగ్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు నార్సింగ్ ఎస్ఐ అహ్మద్ మోహియుద్దీన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు.

అమ్మకు ప్రేమతో..

● ప్రతిమను తయారు చేయించి వివాహ వార్షికోత్సవం



నాగలక్ష్మి ప్రతిమతో సత్యనారాయణ, వారి కుటుంబ సభ్యులు

గుమ్మడిదల, మార్చి 1: అమ్మ గతేడాది కన్నుమూసింది. తన 50వ వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆమె చిరకాలవాంఛ. అయితే ఆ కోరిక నెరవేరకముందే ఆమె కన్నుమూసింది. అమ్మ ప్రేమను ఎరిగిన ఆమె కుమారులు భౌతికంగా అమ్మ లేకపోయినా.. ప్రతిరూపాన్ని తయారు చేయించి తల్లిదండ్రుల 50వ వివాహ వార్షికోత్సవాన్ని అనుకున్నంత ఘనంగా నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలకు చెందిన చెన్నంశెట్టి సత్యనారాయణ భార్య నాగలక్ష్మి(64) గత ఏడాది చనిపోయారు. ఆమెకు 50 సంవత్సరాల వివాహ వేడుకను ఘనంగా జరుపుకోవాలని కోరికగా ఉండేది. చెన్నంశెట్టి సత్యనారాయణ, నాగలక్ష్మిల వివాహం జరిగి శుక్రవారానికి 50 సంవత్సరాలు పూర్తయింది. దీంతో వారి తనయులు చెన్నశెట్టి కోటేశ్వర్, సారథి, సూర్యనారాయణ, శ్రీనివాస్, చంటి, ఉదయ్‌లు తమ తల్లి ప్రతిమను తయారు చేయించి, గుమ్మడిదలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బంధుమిత్రుల సమక్షంలో తల్లిదండ్రుల 50వ వివాహ వేడుకను ఘనంగా నిర్వహించి ఆమె చిరకాల వాంఛను ఈడేర్చారు.

చింతలచెర్వు పీహెచ్‌సీలో వైద్యాధికారుల విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విచారణ జరుపుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

హత్నూర, మార్చి 1: 'చింతల్‌చెర్వు పీహెచ్‌సీలో ఇష్టారాజ్యం' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నాగ నిర్మల స్పందించారు. ఈ మేరకు చింతల్‌చెర్వు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, విచారణ చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నేత్రపతి, సిబ్బందితో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. విచారణ నివేదికను జిల్లా వైద్యాధికారికి అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పూర్తిస్థాయి నివేదిక అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా ఇంటలిజెన్సీ అధికారులు సైతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి విచారణ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.

ఎంసీహెచ్‌లో లీపు రోజున 15 మంది జననం

●బర్త్‌డేకు మరో నాలుగేళ్లు ఆగాల్సిందే

సంగారెడ్డి అర్బన్, మార్చి 1: నాలుగేళ్లకోసారి వచ్చే లీపు సంవత్సరం ప్రత్యేకత అందరికీ తెలిసిందే. ప్రతి ఏటా ఫిబ్రవరిలో 28 రోజులుండగా, లీప్ ఇయర్‌లో ఫిబ్రవరిలో ఒక రోజు అధికంగా 29 రోజులు ఉంటాయి. ఆ రోజు పుట్టిన వారంతా తమ మొదటి బర్త్‌డే జరుపుకునేందుకు నాలుగేళ్ల వరకు ఆగాల్సిందే. ఇదిలా ఉండగా సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఫిబ్రవరి 29వ తేదీన(గురువారం) 15 మంది జన్మించారు. ఈ లీపు వీరులు బర్త్‌డే కోసం మరో నాలుగేళ్లు వేచి చూడాల్సిందే నన్న మాట.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

● ఒక్కరికి జైలు శిక్ష

సిద్దిపేట క్రైం, మార్చి 1: సిద్దిపేటపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన వాహనతనిఖీల్లో 12 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్టు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. వారిని శుక్రవారం సిద్దిపేట అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి. శ్రావణి ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం 12 మందికి మొత్తం రూ.5 వేల జరిమానా విధించారు. వారిలో ఒక నిందితుడికి 2 రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే రోజూ డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

నాసిరకం పనుల వల్లే దెబ్బతిన్న ప్రాజెక్టులు: ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, మార్చి 2: గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాసిరకంగా ప్రాజెక్టులు కట్టడం వల్లనే కొన్నాళ్లకే దెబ్బతిన్నాయని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీఅధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేసిన తప్పును ఒప్పుకోక దెబ్బతిన్న ప్రాజెక్టులను చూసిరావడానికి వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడ్డ విషయమై సమగ్ర విచారణ చేయించి అందుకుబాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఛీ కొట్టి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తే బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా మాటలతో కాలయాపన చేసి ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఆంజనేయులుగౌడ్ ఎద్దేవా చేశారు.

అప్పుల బాధతో ముగ్గురి బలవన్మరణం

ఉమ్మడి మెదక్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం ముగ్గురు వ్యక్తులు బలవన్మరణం చెందారు. మృతులందరూ అప్పుల బాధతోనే ఆత్మహత్యకు పాల్పడడం గమనార్హం.



కుమార్ (ఫైల్)

రాయపోల్, మార్చి 1: అప్పుల బాధతో మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఉప్పరపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చెంగర్ల కుమార్ (44) ఏడాది క్రితం రూ. 3లక్షల అప్పు చేసి కూతురి పెళ్లి చేశాడు. అప్పు తీరేమార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మద్యం ఎందుకు తాగావని భార్య మందలించడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. వెతికినా ఫలితం లేకపోయింది. శుక్రవారం ఉదయం జంగపల్లి రోడ్డు వద్ద గల ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడని గమనించిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య చెంగర్ల జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



చింత కుమార్ (ఫైల్)

● తొగుట: అప్పుల బాధ భరించలేక చింత కుమార్(39) అనే వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం తొగుటలో చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన కుమార్ అప్పులు చేసి వరికోత మిషన్, డీసీఎం వాహనం కొనుగోలు చేశాడు. వాటి కోసం చేసిన అప్పులు తడిసి మోపెడయ్యాయి. ఉన్న ఇంటి స్థలాన్ని, వాహనాలను అమ్మినా అప్పులు తీరలేదు. దీంతో అప్పుల వారి వేధింపులు, కుటుంబ పోషణ భారంగా మారింది. తీవ్ర మనస్థాపానికి గురైన కుమార్ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య కవిత, కొడుకు అభిలాష్, కూతురు అక్షయ ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఘటనలు



సురేష్ మృతదేహం

● చేగుంట: అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్సింగ్ మండల కేంద్రం లోని ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగింది. నార్సింగ్ ఎస్ఐ అహ్మద్ మోహియుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగ్ ఎస్సీ కాలనీకు చెందిన చీగులపల్లి సురేష్ (39) కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ భరించలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. కుటుంబ జీవితం పై విరక్తి చెంది ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

'ధరణి' సమస్యల పరిష్కారానికి కృషి

● గ్రామసభల్లో అధికారుల వెల్లడి

జహీరాబాద్, మార్చి 1: భూ సమస్యల పరిష్కారానికి తమవంతు బాధ్యతగా కృషిచేస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ వంశీ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 1నుంచి 9వ వరకు గ్రామాల్లో ప్రత్యేకడ్రైవ్ చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా రెవెన్యూ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం శేఖాపూర్, చిరాగ్‌పల్లి, హోతి(బి) గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి 300 దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా సమస్య ఏర్పడిందని ఈపాటికే కొందరు రైతులు తమకు దరఖాస్తులు చేసుకున్నారన్నారని ఆయన వివరించారు. ప్రతిరోజు మూడు గ్రామాల్లో గ్రాసభలను చేపట్టేందుకు నిర్ణయించామన్నారు. గ్రామాలకు వచ్చే రెవెన్యూ సిబ్బందికి ప్రజలు సహకరించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్ఐలు యాదిలాల్, రుక్మొద్దీన్, రెవెన్యూ సిబ్బంది, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



చింతలగట్టులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ బాలశంకర్



చిరాగ్‌పల్లి గ్రామసభలో గ్రామస్థులు, రెవెన్యూ అధికారులు

ఝరాసంగంలో

ఝరాసంగం: ధరణి సమస్యల పరిష్కారంలో భాగంగా మండలంలోని ఈదులపల్లి, మేదపల్లి, క్రిష్టాపూర్, మాచ్నూర్ గ్రామాల్లో సభలను నిర్వహించినట్లు తహసీల్దార్ సంజీవరావు తెలిపారు. మొదటి రోజు 200ల పైచిలుకు దరఖాస్తులను పరిశీలించామన్నారు.

కోహీర్ మండలంలో

కోహీర్: మండలంలోని చింతలగట్టు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలు ఉన్న రైతులు గ్రామాల్లో చేపట్టే సదస్సుకు హాజరై పరిష్కరించుకోవాలని తహసీల్దార్ బాలశంకర్ సూచించారు. కొత్తూరు(డి), పర్వపల్లి గ్రామాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. మొదటి రోజు మండలంలో 115 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను, సమస్యలను ఈ నెల 9వరకు గ్రామాల్లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రజలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలకు మహర్దశ



కందిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సరళ

కంది, మార్చి 1: బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే గ్రామాలకు మహర్దశ కలిగిందని ఎంపీపీ కాల్వ సరళాపుల్లారెడ్డి అన్నారు. నేడు గ్రామాలు పచ్చగా కళకళలాడుతున్నాయంటే దానికి కారణం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలేనని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌రావు మంజూరు చేసిన రూ.10 లక్షలతో 12వ వార్డులో మాజీ వార్డు మెంబర్ ఆనందరావు ఆధ్వర్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శుక్రవారం ఎంపీపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలతోనే గ్రామాలు అభివృద్ధిలో ముందజలో ఉన్నాయని చెప్పారు. అనంతరం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ వడ్డెపల్లి కృష్ణాగౌడ్ మాట్లాడుతూ.. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న బీఆర్ఎస్‌ను ప్రజలు దూరం చేసకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, మురళీధర్‌రెడ్డి, గౌస్, కార్యదర్శి విద్యాధర్ గౌడ్, బిల్ కలెక్టర్లు మల్లేశం, కోకల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానిగా మోదీ హ్యాట్రిక్ తథ్యం



పాపన్నపేటలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

పాపన్నపేట, మార్చి 1: భారత ప్రధానిగా నరేంద్ర మోదీ హ్యాట్రిక్ తథ్యమని బీజేపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన పాపన్నపేటలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ నెల 5న మోదీ పటాన్‌చెరు వస్తున్నందున మెదక్ నుంచి 5వేల మంది కార్య కర్తలను తరలిస్తామన్నారు. దేశ కీర్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన బీజేపీనే కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలని కాంక్షించారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు బీకొండ రాములు, మాజీ ఎంపీటీసీ చంద్రయ్య పాల్గొన్నారు.

పేద దళిత కుటుంబాలకు న్యాయం చేయండి

సంగారెడ్డి రూరల్, మార్చి 1: క్రషర్ యాజమానుల వల్ల చితికిపోయిన పేద దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు దుర్గప్రసాద్ కోరారు. హైదరాబాద్‌లో జాతీయ ఎస్సీ కమిషనర్ డైరెక్టర్ సునీల్‌కుమార్‌బాబుకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎర్దనూర్ గ్రామంలోని క్రషర్‌లతో పంటలు దెబ్బతింటున్నాయని, ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని చెప్పారు. వెంటనే క్రషర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో వివిధ సంఘాల నాయకులు మోహన్‌రాజ్, సబిత, లక్ష్మి తదితరులు ఉన్నారు.

వడ్డెర కాలనీలో సీసీ రోడ్డు పనులు షురూ



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేసిన ఆవుల రాజిరెడ్డి

మాసాయిపేట, మార్చి 1: మండల కేంద్రమైన మాసాయిపేటలో వడ్డెర కాలనీకి సీసీ రోడ్డు పనులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. మండలంలోని రామంతపూర్ గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రామంతపూర్ ప్రజలు ఆవుల రాజిరెడ్డిని కోరారు. ఈ సందర్భంగా రామంతపూర్ ప్రజలు తమ సమస్యలను రాజిరెడ్డికి వివరించారు. త్వరలో నియోజకవర్గంలోని గ్రామాల్లో గల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వరూపనరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ వీరన్నగారి కృష్ణారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, భూస్వామి, ముఖ, దశరథ, మెకానిక్ శ్రీనివాస్, పలకట్ల రమేష్, రామంతపూర్ గణేష్, విజయ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌నగర్ కాలనీలో



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం: జీహెచ్ఎంసీ 112వ డివిజన్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో సుమారు రూ.40లక్షలతో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పుష్పనగేష్‌యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రభు, అబ్దుల్ గఫర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి కల్వర్టులోకి దూసుకెళ్లిన బస్సు



బస్సును ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు లాగుతున్న దృశ్యం

కొండాపూర్, మార్చి 1: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కల్వర్టులోకి దూసుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని మాచెపల్లి గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. సంగారెడ్డి నుంచి మైతాబ్‌ఖాన్ గూడకు బయలుదేరని బస్సు మాచెపల్లి శివారుల్లోకి రాగానే అదుపు తప్పి కల్వర్టులోకి దుసుకెళ్లింది. బస్సులో 96 మంది ప్రయాణికులు ఉండడంతోనే అదుపు తప్పినట్లు సమాచారం. బస్సులో ప్రయాణిస్తున్న వారంతా స్కూళ్లు, కాలేజీ విద్యార్థులే కావడం గమనార్హం. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. బస్సును ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు లాగారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలి

వెల్దుర్తి, మార్చి 1: వెల్దుర్తి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు ఉపయోగపడేలా ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గ్రంథాలయ నిర్మాణం చేపటవద్దని శుక్రవారం ఏబీవీపీ నాయకులతో కలిసి తహసీల్దార్ తులసీరామ్‌కు, ఎంపీడీవో జగదీశ్వరచారికు శ్రీనివాస్‌గౌడ్‌వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని, విద్యార్థులకు క్రీడా నైపుణ్యాన్ని పెంచే విధంగా అధికారులు, నాయకులు ఆలోచించాలని ఆయన అన్నారు. ఆటస్థలంలో నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయనవెంట ఏబీవీపీ నాయకులు ఉదయ్, వర్షిత్, సాయి సత్య భారత్, శశాంక్, అరవింద్ తదితరులు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

నర్సాపూర్, ఫిబ్రవరి 1: కౌడిపల్లి మండలం అంతారంకు చెందిన గొల్లరాములు అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.75వేల ఎల్‌వోసీని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి బాధిత కుటుంబానికి శుక్రవారం నర్సాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సీఎం సహాయ నిధి ఎంతో దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో అంతారం మాజీ సర్పంచ్ అశోక్, ఎన్ఎస్‌యూఐ నాయకులు హరీష్, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

లీప్ రోజున 15 మంది జననం

సంగారెడ్డి అర్బన్, మార్చి 1: నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ సంవత్సరానికి ప్రత్యేకత ఉంటుంది. సాధారణంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి నెలలో 28 రోజులుంటాయి. కానీ లీప్ ఏడాది ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. ఆ రోజు పుట్టిన వారంతా ప్రతి నాలుగేళ్లకోసారి వచ్చే జన్మదినాన్ని ఎంతో సంబురంగా జరుపుకుంటారు. ఇలా ఉండగా సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో లీప్ రోజున గురువారం 15 మంది జన్మించారు. వీరు తమ మొదటి పుట్టిన రోజు జరుపుకోవాలంటే మరో నాలుగేళ్లు ఆగాల్సిందే.

మాజీ ఎమ్మెల్యేకు నివాళి

పాపన్నపేట, మార్చి 1: మెదక్ మాజీ ఎమ్మెల్యే, దివంగత నారాయణరెడ్డి వర్ధంతిని శుక్రవారం ఆయన స్వగ్రామమైన యూసుఫ్‌పేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులు, కుమారుడు, మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డితో పాటు నాయకులు యేసురెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ నర్సింహులు, మాజీ డైరెక్టర్ వెంకోబా, మధుసూదన్ రెడ్డి, బుజంగరెడ్డి, వెంకటరామ్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు.

కొత్తపల్లి సొసైటీ మాజీ చైర్మన్ కన్నుమూత

పాపన్నపేట: కొత్తపల్లి సొసైటీ మాజీ చైర్మన్ గంగుల రుక్మారెడ్డి(74) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఏడు పాయల మాజీ చైర్మెన్ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, మార్చి 1: ఇంటర్ ఫస్టియర్ ఆంగ్లం పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 18,964 మందికి 18,159 మంది హాజరు కాగా, 805 మంది గైర్హాజరయ్యారు. 97.76 హాజరు శాతం నమోదైంది. సంగారెడ్డిలోని శ్రీ అక్షయ, షాహీన్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవింద రామ్ తనిఖీ చేశారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్: తూప్రాన్ పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను శుక్రవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని సూచించారు. ఆర్డీవో వెంట తూప్రాన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఉన్నారు.

ఆస్తిపన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ

● అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్

తూప్రాన్, మార్చి 1: రాష్ట్ర ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిలపై 90శాతం వడ్డీమాఫీ అవకాశాన్ని కల్పిస్తున్నదని, ఈ అవకాశాన్ని తూప్రాన్ మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఖాజామొహిజుద్దీన్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి చెందిన వడ్డీ మాఫీ 90శాతం చేస్తున్నట్లు తెలిపారు. మిగతా 10శాతం వడ్డీని వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌లో భాగంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2024 మార్చి వరకు వడ్డీ, లేదా జరిమానాతో సహా మొత్తం ఆస్తి పన్ను బకాయిలు చెల్లించిన వారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. చెల్లింపులు చేసిన వారికి 90శాతం వడ్డీ భవిష్యత్తు బిల్లులో సర్దుబాటు చేయనున్నట్లు వివరించారు.

జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో భస్మలింగేశ్వర మహోత్సవం

సంగారెడ్డి రూరల్, మార్చి 1: మహాశివార్రాతి పర్వదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఈ నెల 8న 20.06 అడుగుల భారీ భస్మలింగాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆశ్రమ వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు లక్షల మంది వరకు భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నదని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం భస్మలింగేశ్వర మహోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జ్యోతిర్వాస్తు విద్యాపీఠం సభ్యులు ప్రశాంత్‌కుమార్, సాయినాథ్, సంజయ్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ పర్యటనను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

జిన్నారం, మార్చి 1: ప్రధాని మోదీ జిల్లా పర్యటన, బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి కోరారు. శుక్రవారం జిన్నారంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు బైండ్ల కుమార్, జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 5న పటాన్‌చెరులో నిర్వహించే ప్రధాని మోదీ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రధాని సభకు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బీజేపీలో చేరిక

బొల్లారం మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఆనందకృష్ణారెడ్డి తిరిగి బీజేపీ గూటికి చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరిన ఆనందకృష్ణారెడ్డి, ఆయన అనుచరులు శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.

మోదీ సభకు జనసమీకరణ చేయాలి

మనోహరాబాద్: ప్రధాని మోదీ సభకు మనోహరాబాద్ మండలం నుంచి పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని మండల నాయకులకు బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ బండారు మహేష్ దిశానిర్దేశం చేశారు. మనోహరాబాద్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశలో బీజేపీ మండలాధ్యక్షుడు నరేంద్రచారి, నాయకులు నరేష్, మల్లేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో 4,500 మందికి జీరోబిల్లులు

మెదక్ అర్బన్, మార్చి 1: మెదక్ జిల్లాలో శుక్రవారం 4,500 మంది లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లులను అందజేసినట్లు ఎస్ఈ జానకిరాములు తెలిపారు. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారుంటే ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, రేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి గృహజ్యోతి పథకం వరిస్తుందని ఆయన వెల్లడించారు.



వెల్దుర్తిలో జీరో విద్యుత్ బిల్లును అందజేస్తున్న ఏఈ వెంకటేశ్వర్లు

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నారాయణఖేడ్: గృహ జ్యోతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహజ్యోతి పథకాన్ని శుక్రవారం మండల పరిధిలోని వెంకటాపూర్‌లో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 1 నుంచి ఆహార భద్రత కార్డు ఉండి, 200లోపు యూనిట్లు వినియోగిస్తున్న వారికి గృహజ్యోతి పథకం వర్తిస్తుందని చెప్పారు. 11 లక్షల మందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో ఏఈ నారాయణ, సబ్ ఇంజనీర్ సురేష్, చంద్రశేఖర్‌దేశ్‌ముఖ్, రవికాంత్, గంగయ్య, పుర్రె సాయిలు పాల్గొన్నారు.

పట్టణాలు, గ్రామాల్లో గృహజ్యోతి పథకం ప్రారంభం

సంగారెడ్డి రూరల్/తూప్రాన్/వెల్దుర్తి/చేగుంట: జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించినట్లు విద్యుత్ శాఖ డీఈ సురేందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని రాజంపేటలో లబ్ధిదారులకు జీరో బిల్లును అందజేశారు. తూప్రాన్ పట్టణంలో గృహజ్యోతి పథకాన్ని విద్యుత్‌శాఖ డీఈ రాజేందర్ ప్రారంభించారు. తూప్రాన్ పట్టణం, పోతరాజుపల్లి గ్రామంలో జీరో విద్యుత్ బిల్లులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఈ రాజమల్లేశం, ఏఈ వరహాలబాబు పాల్గొన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలో వినియోగదారులకు విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు జీరో బిల్లులను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది నర్సింహులు, యాదగిరి, రాము తదితరులు పాల్గొన్నారు. చేగుంట మండల కేంద్రంలో అర్హులైన లబ్ధిదారులకు జీరో బిల్లులను శుక్రవారం ట్రాన్స్ కో ఏఈ రాములు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి అమలుపై అవగాహన

తూప్రాన్: గృహజ్యోతి పథకం అమలుపై విద్యుత్‌శాఖ తూప్రాన్ డీఈ రాజేందర్ తూప్రాన్‌లో విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద శుక్రవారం సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీఈ రాజమల్లేశం, ఏఈలు వరహాలబాబు, కృష్ణ, దుర్గప్రసాద్, వెంకటేశ్, మనోహర్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

● పారిశుధ్య కార్మికుల డిమాండ్

● జహీరాబాద్‌లో ఆందోళన

జహీరాబాద్, మార్చి 1: పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఉదయం జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు, సీఐటీయూ జిల్లా నాయకుడు మహిపాల్ మాట్లాడుతూ.. రెండునెలలుగా వేతనాలు రాకపోవడంతో పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రెక్కాడాతేకాని డొక్కాడని కార్మికులకు సకాలంలో వేతనాలు రాకపోతే కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారుతుందన్నారు. వేతనాలు చెల్లించాలని మున్సిపల్ అధికారులను కోరినప్పటికీ పట్టించుకోవడంలేదని విచారం వ్యక్తం చేశారు. పన్నులు వసూలైతే తప్పా వేతనాలు ఇవ్వలేమని మున్సిపల్ అధికారులు చెప్పడం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి మున్సిపాలిటీలో కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, పారిశుధ్య కార్మికులు కామయ్య, యశోదమ్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

గురుకులాల నిర్వహణ తీరును మార్చుకోవాలి

● ఎమ్మెల్యే సంజీవరెడ్డి

● బాచేపల్లి గురుకుల ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం

కల్హేర్, మార్చి 1: నియోజకవర్గంలోని గురుకులాల నిర్వహణ తీరును మార్చుకుని, విద్యార్థులకు న్యాయం చేయాలని నారాయఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. నిజాంపేట మండలం బాచేపల్లిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలో లేని ప్రిన్సిపాల్ పద్మావతి ఎమ్మెల్యే వచ్చారని తెలుసుకుని రావడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందించే భోజనం బాగుండడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు తనకు ఫిర్యాదు చేశారని చెప్పారు. ప్రజాప్రతినిధులు చెప్పినట్లుగా గురుకులాన్ని నడపడం మూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురైనట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. నెలల తరబడి పేరెంట్స్ మీటింగులు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. పేరెంట్స్ అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పేరెంట్స్ మీటింగ్ పెట్టి తనను ఆహ్వానించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని, వారిని పాఠశాల ప్రాంగణంలోకి అనుమతించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు తమ అభిప్రాయం వెలిబుచ్చే విధంగా వెసులుబాటు కల్పించాలని, వారిని పాఠశాల విషయాలు బయటికి పొక్కకుండా భయపెడితే చర్యలు తప్పవన్నారు. కాగా బాచేపల్లి గురుకులంలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ పద్మావతి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.



బాచేపల్లి గురుకులంలో రికార్డులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఏరియా ఆస్పత్రిలో టీ-హబ్ ప్రారంభం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం టీ-హబ్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి టీ-హబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త సంగారెడ్డి, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, ముంతాజ్, శంకర్, మైనోద్దిన్, శెట్టి శంకర్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

నాగల్‌గిద్ద సర్వసభ్య సమావేశంలో

నాగల్‌గిద్ద: ఎంపీపీ మోతిబాయి రాథోడ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన నాగల్‌గిద్ద మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరై మాట్లాడారు. సమావేశంలో జడ్పీటీసీ రాజురాథోడ్, వైస్ ఎంపీపీ పండరియాదవ్, తహసీల్దార్ షబానా, ఎస్ఐ సిద్ధిరాములు, ఎంపీడీవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మాక్ పోలింగ్

జోగిపేట, మార్చి 1: అందోలులోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. ఎలక్షన్ కమిషనర్, జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎన్నికల విధానంపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాలలోని 6నుంచి 10వతరగతి వరకు విద్యార్థులు మాక్ పోలింగ్‌లో పాల్గొన్నారు. విద్యార్థులే పోటీదారులుగా, ఎన్నికల సిబ్బందిగా, పోలీసులుగా, పోలింగ్ ఏజెంట్లుగా విధులు నిర్వహించారు. ఓటర్లుగా ఆధార్ కార్డు చూపించి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.దేవిదాస్, ఉపాధ్యాయులు ఎస్ విబి గీతాకుమారి, కె.రమేష్, ఎ.మాణయ్య, అబ్దుల్ అజీమ్, సరిత, కొండల్, నవీన, వి.బి శ్రీనివాస్,వి.సాయిలు, శ్రీదేవి పాల్గొన్నారు



చెట్లపోతారంలో మాక్ పోలింగ్..



అందోలులో మాక్ పోలింగ్‌లో విద్యార్థులు

మల్‌చెల్మలో

జహీరాబాద్: మండల పరిధిలోని మల్‌చెల్మ గ్రామంలో గల ప్రభుత్వోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మాక్ పోలింగ్ నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థులు మాక్ పోలింగ్‌లో విధులను నిర్వహించగా 6,7,8 తరగతుల విద్యార్థులు ఓటు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకుడు తులసీరాంరాథోడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెట్లపోతారంలో

జిన్నారం: చెట్లపోతారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కుమారస్వామి, ఉపాధ్యాయుడు మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించ దగ్గ మేధావి సీవీ రామన్

● వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ రామచంద్రయ్య

కంది, మార్చి 1: సైన్స్ రంగంలో ఎదురులేని శక్తి, దేశం గర్వించ దగ్గ మేధావి సీవీ రామన్ అని వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ రామచంద్రయ్య అన్నారు. తెలంగాణ అకడామీ ఆఫ్ సైన్స్, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా శుక్రవారం కంది మండలపరిధిలోని చేర్యాల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ డేలో ఆయన మాట్లాడారు. ఆకాశం, నీరు ఎందుకు నీలి రంగులో కనపడుతున్నాయనే విషయంపై పరిశోధించిన తర్వాతనే సీవీ రామన్ ఎఫెక్ట్ మనందరికీ తెలిసిందన్నారు. ఫిజికల్ సైన్స్ విభాగంలో దేశానికి 1930 నుంచి ఇప్పటివరకు నోబెల్ ప్రైజ్ రాకపోవడం ఆలోచించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరాజయ్య, ఉపాధ్యాయులు ఎం.సోమశేఖర్, జేవీవీ నాయకులు జాన్‌పాల్ పాల్గొన్నారు.



చేర్యాలలో మాట్లాడుతున్న రామచంద్రయ్య



హెచ్ అండ్ ఆర్ బ్లాక్ కంపెనీ, హెల్పింగ్ హ్యాండ్స్ ఫర్ పూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో న్యాల్‌కల్ మండలం రజోల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనానికి శుక్రవారం పెయింటింగ్ వేయించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు హరీష్, తిరుపతి, వినయ్, తిరుమలేశ, సంస్థ ప్రతినిధులు భరత్‌కుమార్, శ్వేత, దన్నారం కార్తిక్, జయప్రకాష్, విజయ్‌కుమార్, హెచ్ఎం వెంకటేష్ పాల్గొన్నారు.

న్యాల్‌కల్, మార్చి 1: